సాక్షి రంగారెడ్డి

మంగళవారం, 25, ఏప్రిల్, 2023

బామ్మానందం: కుటుంబ సభ్యులతో బామ్మ ఆనంద హేల







వికెట్ తీసిన ఆనందంలో సన్‌రైజర్స్



గ్రౌండ్‌లో దిగ్గజాలు గంగూలీ, పాంటింగ్, వార్నర్, షేన్ వాట్సన్

అభిమాన కెరటం

ఉప్పల్ స్టేడియంలో వరుసగా నాలుగో ఐపీఎల్ మ్యాచ్‌కు ప్రేక్షకులు పోటెత్తారు. సోమవారం అభిమాన కెరటం ఉరకలెత్తింది. మ్యాచ్‌ను ఆసాంతం ఆస్వాదించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మాజీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్‌గా బరిలోకి దిగాడు. బ్యాటర్లు పరుగుల వరద పారించకపోయినా... బౌలర్లు మాత్రం వికెట్ల వేటలో పైచేయి సాధించారు. సన్‌రైజర్స్ బౌలర్లు భువనేశ్వర్, వాషింగ్టన్ సుందర్ పొదుపుగా బౌలింగ్ చేశారు. ఢిల్లీ జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. ఢిల్లీ బ్యాటర్లలో వార్నర్, మార్ష్, మనీశ్ పాండే, అక్షర్ పటేల్ ఆకట్టుకున్నారు. కాగా.. సన్‌రైజర్స్ జట్టు ఓడిపోవడంతో ప్రేక్షకులను నిరాశపర్చింది.



సచిన్‌కు బర్త్‌డే విషెస్



గాయకుడు రాహుల్ సిప్లిగంజ్, టీవీ నటి వర్షిణి



న్యూస్‌రీల్

ఇబ్రహీంపట్నం గడ్డపై ఎర్ర జెండా ఎగురవేస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మంచాల:వచ్చే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం గడ్డపై ఎర్ర జెండా ఎగుర వేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. తెలంగాణలో బీజేపీ వ్యతిరేక వర్గాల తో కలిసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్, నియోజకవర్గ కన్వీనర్ పగడాల యాదయ్య,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామెల్, మండల కార్యదర్శులు శ్యాం సుందర్, నర్సింహ పాల్గొన్నారు.

మోదీ, అమిత్‌షా చేతుల్లో దేశం నాశనం

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

మొయినాబాద్: ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశాన్ని నాశనం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. మోదీకో హటావో.. దేశ్‌కో బచావో అనే నినాదంతో 'ఇంటింటికీ సీపీఐ'లో భాగంగా సోమవారం మండల కేంద్రం తోపాటు పెద్దమంగళారం, రెడ్డిపల్లి, చందానగర్, చిలుకూరు, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ అధికారంలోకి వచ్చాక దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని, ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. దేశ సంపదను అదాని, అంబానీలకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. దేశంలో మతతత్వ భావజాలాన్ని పెంచుతూ దళిత, గిరిజన, వెనుకబడిన కులాల మీద దాడులు, దౌర్జన్యాలకు ఉసిగొల్పుతున్నారని.. మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ రామస్వామి, కో కన్వీనర్ ప్రభులింగం, మండల కార్యదర్శులు కె.శ్రీనివాస్, సత్తిరెడ్డి, సుధీర్, జంగయ్య, నాయకులు సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, అంజయ్య, మాధవి, మంజుల, ప్రభాకర్, శివ, శ్యాంసుందర్, రాములు, అర్జున్‌రావు, నరేందర్, సత్తయ్యగౌడ్, వెంకటయ్య, గణేశ్‌రెడ్డి, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్స్‌లో మే 2 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి పాసైన మహిళలు ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతోపాటు ఎస్‌ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతచేయాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యంతోపాటు యూనిఫాం, టూల్ కిట్స్ ఉచితంగా అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 86390 79122, 97819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటినుంచి లబ్ధిదారుల సర్వే

ఇబ్రహీంపట్నం రూరల్: కర్మన్‌ఘాట్–3 (512) జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం హౌసింగ్ కాలనీ అసలు లబ్ధిదారులకు మంగళవారం నుంచి 4వ తేదీ వర కు సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ హరీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నాళ్లీ 'పంచాయితీ'!



షాబాద్ పంచాయతీ కార్యాలయం

- ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిన పంచాయతీ జూనియర్ కార్యదర్శులు
- రెగ్యులరైజ్ కోసం నిరీక్షణ
- చాలీచాలని వేతనంతో ఇబ్బందులు
- పర్మినెంట్ చేయాలంటూ విన్నపం

షాబాద్: పంచాయతీ జూనియర్ కార్యదర్శుల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయినా పర్మనెంట్ చేయడం లేదు. దీంతో వారు చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్నారు. ఈ నెల 11తో నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయిందని, ఇప్పటికైనా తమను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో వేలాది రూపాయల జీతం ఉన్నా ఎంతో మంది వాటిని వదులుకొని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగాలు పొందారు. సాధారణంగా ఏ ప్రభుత్వ ఉద్యోగానికైనా రెండేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ ఉంటే..జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మాత్రం నాలుగేళ్లు విధించారు. అదీ ఈ నెల 11తో ముగిసింది. అయినా పర్మనెంట్ చేయకపోవడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల సాధనకు గత బుధవారమే ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు.

మూడేళ్ల ప్రొబేషనరీతోనే నియామకాలు..

ప్రభుత్వం 2019లో జూనియర్ పంచాయతీ కార్య దర్శుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. పోటీ పరీక్షను నెగెటివ్ మార్కింగ్ విధానంలో నిర్వహించి రాష్ట్రంలో 9,355 మంది జూనియర్ పంచాయతీ సెక్రటరీలను నియమించింది. మొదట మూడేళ్ల ప్రొబేషనరీ పెట్టి రూ.15వేల చొప్పున జీతం చెల్లించింది. ప్రొబేషనరీ ముగిసిన తర్వాత తమను పర్మి నెంట్ చేయాలని కార్యదర్శులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సీఎం కేసీఆర్ గత అసెంబ్లీ సమా వేశాల్లో జేపీఎస్‌ల వేతనాలను రూ.15వేల నుంచి రూ.28,719కి పెంచి పర్మనెంట్ చేయకుండా ప్రొబేషనరీ పీరియడ్‌ను మరో ఏడాది పొడిగించారు.

పని ఒత్తిడితో సతమతం

గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పథకాల అమలు, హరితహారం, శానిటేషన్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ, నివాస గృహాలు, ఇతర నిర్మాణ అనుమతులు, ఆస్తి మార్పిడి సర్టిఫికెట్లు, దుకాణాల లైసెన్సులు, ఉపాధి పనులు, విపత్తు నిర్వహణ తదితర పనులను ప్రభుత్వం పంచాయతీ సెక్రటరీలకే అప్పగించింది. పని ఒత్తిడి పెరగడంతో కొందరు ఉద్యోగాలకు రాజీనామా చేయగా, వారి స్థానాల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించి వేతనాలు చెల్లిస్తున్నారు. తమకు ప్రొబేషనరీ కార్యదర్శులతో సమానంగా వేతనాలివ్వాలని ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు కోరుతున్నారు. జిల్లాలో 353 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులున్నారు. ఇందులో 303 మంది నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేసుకున్నారు. మిగతా వారు ఔట్ సోర్సింగ్ సెక్రటరీలుగా కొనసాగుతున్నారు.

పని భారం తగ్గించాలి



కార్యదర్శులకు పని భారం తగ్గించాలి. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విధులు నిర్వహిస్తున్నాం. అయినా పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించకపోవడం బాధాకరం. ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేసుకున్న వారిని వెంటనే పర్మనెంట్ చేయాలి.

– ఆశ్రిత, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, నరెడ్లగూడ

పేస్కేల్ వర్తింపచేయాలి



పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పేస్కేల్ ఇస్తూ పర్మనెంట్ ఉద్యోగులకు కల్పిస్తున్న బెనిఫిట్స్ అన్నీ వెంటనే వర్తింపజేయాలి. మా శ్రమను గుర్తించి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి.

– చంద్రకాంత్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, చందనవెళ్లి

క్రమబద్ధీకరించాలి



పని భారంతో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు.ఉద్యోగంలో చేరి నాలుగేళ్లు పూర్తయినా పర్మనెంట్ చేయకుండా ప్రభుత్వం నాన్చుతోంది.సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ప్రొబేషనరీ పూర్తియిన వారందరినీ వెంటనే క్రమబద్ధీకరించాలి.

– యాదగిరి, జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోలీపేట్

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు

- ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మతాల మధ్య విద్వేషాలు రేపేందుకే చేవెళ్లలో బీజేపీ విజయసంకల్ప సభ నిర్వహించిందని విమర్శించారు. మండలకేంద్రంలో సోమవారం చేవెళ్ల, వికారాబాద్, పరిగి ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ఆనంద్, హరీశ్వర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు బీజేపీ నాయకులు వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమం అంటుంటే కేంద్రం సంక్షోభం అంటోందన్నారు. తొమ్మిదేళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రం అడిగిన ఏ ఒక్కటైనా ఇచ్చిందా అని నిలదీశారు. హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై బీజేపీ నేతల మాటల్లో నిజం లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. మరోసారి కేసీఆర్, వారి కుటుంబంపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. బండి సంజయ్‌ను మెప్పుకోవటానికే సభ పెట్టినట్లు ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి క్యాడర్ లేదు కాంగ్రెస్‌కు లీడర్ లేరని.. ఈ రెండూ ఉన్న పార్టీ బీఆర్‌ఎస్ అని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బీఆర్‌ఎస్‌పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమన్నారు. బీజేపీ దమ్ముంటే కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పించాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో చేవెళ్ల, శంకర్‌పల్లి ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శేరి శివారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో 7500 మంది ఆర్టిజన్లు

- నేటి నుంచి సమ్మెలోకి...
- విపత్తులు సంభవిస్తే.. విద్యుత్ పునరుద్ధరణ కష్టమే
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన డిస్కం యాజమాన్యం
- పోలీసుల అదుపులో పలువురు ఆర్టిజన్ నేతలు

సాక్షి, రంగారెడ్డి: యాజమాన్యం ఆదేశాలు ధిక్కరించి మొండిగా సమ్మెకు వెళ్లే కార్మికులను విధుల నుంచి తొలగించనున్నట్లు తెలంగాణ విద్యుత్ సంస్థలు ప్రకటించాయి. అయినా విద్యుత్‌శాఖలోని ఆర్టిజన్లు సమ్మెకు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి కార్మికులంతా నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. సర్కిల్ ఆఫీసులు, సబ్‌స్టేషన్లను ముట్టడించే అవకాశం ఉంది. ఇప్పటికే ఆ సంఘం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పంజగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యుత్ అంతరాయాలకు ఛాన్స్..

గ్రేటర్ జిల్లాల్లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 55 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 450 సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 7,500 మందికి పైగా ఆర్టిజన్లు పనిచేస్తున్నారు. ప్రస్తుతం భగ్గున మండుతున్న ఎండలకు తోడు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడు తున్నాయి. లైన్లు తెగిపడటంతో పాటు కరెంట్ పోల్స్ విరిగిపడుతున్నాయి. సరఫరాలో తరచూ అంతరాయాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కార్మికులంతా సమ్మెలోకి వెళ్తే..విద్యుత్ పునరుద్ధరణ పనులు నిలిచి..వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు. కాగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి సమ్మెకు వెళ్తే చర్యలు తప్పవని టీఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి హెచ్చరించారు. 'విద్యుత్ సంస్థలో అత్యవసర సర్వీసుల చట్టం అమల్లో ఉంది. సమ్మె చట్ట విరుద్ధం. ఆర్టిజన్ సర్వీసు నిబంధన 34(20) ప్రకారం ఈ సమ్మెను దుష్ప్రవర్తన కింద పరిగణించబడుతుందన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్‌రూరల్: విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌ఎస్పీడీసీఎస్ సెక్రటరీ వెంకటేశ్ డిమాండ్‌చేశారు. ఈ నెల 25న విద్యుత్ కార్మికులు చేపట్టనున్న సమ్మె వాల్‌పోస్టర్‌ను సోమవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు 7శాతం పీఆర్సీని ప్రకటించడం అన్యాయమని అన్నారు. గ్రేడ్–1 నుంచి గ్రేడ్–4 ఉద్యోగుల వరకు 1000 నుంచి 2000 మాత్రమే పెరిగిందని, 7శాతం పీఆర్సీతో లబ్ధి పొందినవారు ఇంజనీరింగ్ విభాగంలో మాత్రమే ఉన్నారని తెలిపారు. వారికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వేతనాలు పెరిగాయని అన్నారు. విద్యుత్ కార్మికులకు పీఆర్సీని 51 శాతానికి పెంచాలని, ఏపీఎస్‌ఈబీ నిబంధనలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేష్, రాజు, శేఖర్, రాజు, కిషన్, వినోద్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్ కార్మికులు

దాహంతీరేలా..

వచ్చే జూన్ నాటికి ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు ఫేజ్– 2 పూర్తి

- 137 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో రిజర్వాయర్లు
- 2108 కిలోమీటర్ల మేర నూతన పైపులైన్ వ్యవస్థ
- మరో 2 లక్షల కుటుంబాలకు నల్లా కనెక్షన్లు
- రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో పనులు

ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు ఫేజ్ - 2 పనులు ఇలా

మండలం	రిజర్వాయర్ సామర్థ్యం (మి.లీటర్లు)	పైపులైన్ పొడవు (కి.మీ)	నిధులు (రూ.కోట్లలో)
హయత్ నగర్	7.5	310	146.00
ఘట్‌కేసర్	20	214	128.00
ఇబ్రహీంపట్నం	0.5	36	18.00
మహేశ్వరం	01	66	32.00
మేడ్చల్	0.2	50	26.00
కుత్బుల్లాపూర్	18	161	111.00
శంషాబాద్	2.5	94	49.00
ఆర్సీపురం, పటాన్‌చెరు, బొల్లారం	18	364	197.00
రాజేంద్రనగర్	23	320	186.00
కీసర	6.5	100	57.00
శామీర్ పేట	10	99	67.00
సరూర్‌నగర్	28	294	180.00

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) పరిధిలోని ప్రతి కాలనీకి తాగునీటిని అందించేందుకు చేపట్టిన ఓఆర్‌ఆర్ ఫేజ్–2 ప్రాజెక్టు పనులు వచ్చే జూన్ నాటికి పూర్తి చేసేలా జలమండలి చర్యలు చేపట్టింది. ఫేజ్–2 పనులు పూర్తయితే మొత్తం మీద శివారు ప్రాంతాలకు 50 ఎంజీడీల నీరు సరఫరా కానుంది. వాస్తవంగా ఓఆర్‌ఆర్ పరిధిలోని నగర శివారు గ్రామాల ప్రజలకు తాగునీటి ని అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.75 6.56 కోట్లు వెచ్చించి మొత్తం 70 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 164 రిజర్వాయర్లను నిర్మించింది. నీటి సరఫరా కోసం సుమారు 1,600 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసి నాలుగేళ్ల నుంచి శివారు గ్రామాలకు తాగునీరు అందిస్తోంది. మిగతా కాలనీలకు సైతం నీటిని సరఫరా చేసేందుకు పనులు చేపట్టింది.



ఓఆర్‌ఆర్ పేజ్–2 కింద నిర్మిస్తున్న రిజర్వాయర్లు

మరో 2 లక్షల కుటుంబాలకు..

ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు ఫేజ్– 2 పూర్తయితే కొత్తగా 2 లక్షల కుటుంబాలకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే శివారు ప్రాంతాల్లోని కాలనీల్లోని 1.5 లక్షల నల్లా కనెక్షన్లకు సరిపడా నీరు అందుతోంది. ప్రస్తుతం ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు ఫేజ్ –2 కింద సుమారు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో 137 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 70 స్టోరేజీ రిజర్వాయర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇందుకోసం కొత్తగా 2108 కిలోమీటర్ల పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది.

ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు ఇలా..

గ్రేటర్ అవతల, ఓఆర్‌ఆర్ పరిధిలోని 190 శివారు గ్రామాలకు తాగునీటి కోసం జలమండలి భారీ ప్రాజెక్టుకు పూర్తి చేసి ఇంటింటికీ నల్లా కనెక్షన్లను అందించి తాగునీరు సరఫరా చేస్తోంది. ప్రాజెక్టు పరిధిలోకి గ్రామకంఠం బయట ఏర్పడిన కొత్త కాలనీలకు నీరు అందలేదు. దీంతో అక్కడ తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు కోసం ఆయా కాలనీల నుంచి డిమాండ్ వ్యక్తమైంది. గ్రామకంఠాల బయట ఉన్న నూతన కాలనీలకు కూడా తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జలమండలి ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు ఫేజ్– 2 కింద పనులు చేపడుతోంది.

జాగ్రత్తలతో చోరీలకు చెక్


షాద్‌నగర్‌లో తాళం వేసిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసు

- ఊరెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- బంగారు నగలు, డబ్బులు ఇళ్లల్లో ఉంచుకోరాదు
- సీసీ కెమెరాల ఏర్పాటుతో మేలు

షాద్‌నగర్: వేసవి సెలవులు వచ్చాయంటే సరదాగా గడిపేద్దామని అనుకుంటారు. ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లు, విహార యాత్రలకు వెళుతుంటారు. ఈ హడావుడిలో చాలా మంది ఇంటి భద్రత గురించి పట్టించుకోరు. ఇదే అదనుగా చూసుకొని దొంగలు తమ పని కానిచ్చేస్తారు. ఇళ్లలోకి చొరబడి ఉన్నదంతా దోచేస్తారు. ఇలాంటివి చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాద్‌నగర్ పోలీసులు సూచిస్తున్నారు.

ఇవీ సూచనలు

- సెలవులకు ఊరు వెళ్లాలనుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఇంట్లో ఉండేలా చూసుకోవాలి.
- ఎక్కువ రోజులు ఊరు వెళ్లాలనుకుంటే పక్కింటికి వారికి ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలి.
- ద్విచక్ర వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి లాక్ వేయాలి.
- ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి.
- సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.
- ఇంట్లో నమ్మకమైన వాచ్‌మెన్‌ను మాత్రమే సెక్యురిటీ గార్డుగా పెట్టుకోవాలి.
- ఇంట్లోని బీరువాలు, అల్మారాలకు తాళాలు వేసి రహస్య ప్రదేశంలో ఉంచాలి.
- ఊరెళ్లే ముందు ఇంటి ఆవరణలో ఉన్న లైట్లు వేసి ఉంచాలి. ఇంటి గేటుకు బయట కాకుండా లోపల తాళం వేయడం మంచిది. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం తాళాన్ని అమర్చుకోవాలి.
- ఇంటి డోరు తాళం వేసి కర్టెన్ వేయడం మర్చిపోవద్దు

బ్యాంకుల్లోనే భద్రంగా..

- ఊరెళ్లే ముందే మీ దగ్గర ఉన్న విలువైన బంగారు నగలు, ఆభరణాలు, నగదు, పత్రాలను బ్యాంక్ లాకర్‌లో భద్రపర్చుకోవాలి.

గస్తీ ముమ్మరం

- దొంగతనాలను అరికట్టేందుకు షాద్‌నగర్ పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా శివారు కాలనీలో ఉండే ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఉదయం, రాత్రి వేళల్లో పోలీసులు కాలనీల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులపై నిఘా పెంచారు.

అవగాహన కల్పిస్తున్నాం



వేసవి సెలవుల సందర్భంగా చాలా మంది ఊళ్లకు వెళుతుంటారు. అలాంటి వారు పోలీసులకు సమాచారం అందించాలి. విలువైన బంగారు నగలు, నగదు బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి. ప్రతి ఇంట్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దొంగతనాల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం, ప్రత్యేక పోలీసు బృందాలను కూడా ఏర్పాటు చేశాం.

– నవీన్‌కుమార్, సీఐ షాద్‌నగర్ టౌన్

వృద్ధురాలి అదృశ్యం


శాంతబాయి(ఫైల్)

పహాడీషరీఫ్: వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్ కథనం మేరకు.. జియాగూడకు చెందిన శాంతబాయి(82)ని వారం రోజుల క్రితం జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నివాసం ఉండే ఆమె కుమార్తె రాధాబాయి తన ఇంటికి తీసుకెళ్లింది. ఈ నెల 21న కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రించారు. ఉదయం లేచి చూడగా శాంతబాయి కనిపించలేదు. ఆమె ఆచూకీ పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేక పోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ లేదా సెల్ నంబర్ 94906 17241కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కారు ఢీకొని మహిళ మృతి


రాములమ్మ మృతదేహం

కడ్తాల్: మండలంలోని మైసిగండి గ్రామం శ్రీశైలం – హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. ఆమనగల్లు మండలం సింగంపల్లికి చెందిన ఏ రాములమ్మ(65) ఆదివారం మైసిగండి ఆలయం వద్ద బంధువుల ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి అదే రోజు రాత్రి 9గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళుతున్న కారు రాములమ్మను అతి వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాములమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని సీఎస్‌కే విల్లాస్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్లు, వీధి దీపాలు, మంచినీటి వసతి, అంతర్గత మురుగు కాలువల నిర్మాణం వంటి సదుపాయాలకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. పట్టణంలోని పాత జాతీయ రహదారి విస్తరణ, వివిధ కాలనీల ప్రధాన రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం సీఎస్‌కే విల్లాస్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కౌన్సిలర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల డిమాండ్లు తీర్చాల్సిందే


వీఓఏల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఆచారి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

కడ్తాల్: సీఎం కేసీఆర్ కుటుంబ పాలనలో ఏ ఒక్కరికీ భద్రత లేకుండా పోయిందని, తెలంగాణ ఏర్పాటయ్యాక కేవలం కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బాగుపడిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం కడ్తాల్‌లో వీఓఏలు చేపట్టిన సమ్మెకు సోమవారం బీజేపీ నాయకులతో కలసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఐకేపీ వీఓఏలు ముఖ్య పాత్ర పోషిస్తారని కొనియాడారు. వీఓఏల డిమాండ్లను వెంటనే తీర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. వీఓఏల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, రామ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భగీరథ్, జిల్లా నాయకులు సాయిలాల్, లక్ష్మణ్‌నాయక్, రవీందర్‌రెడ్డి, మండల నాయకులు జే సాయిలు, జే రవి, కుమార్, చందన్ నాయక్, వెంకటేశ్, రాందాస్‌నాయక్, వెంకటేశ్, మల్లేశ్, ప్రేమ్‌కుమార్, శివ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్

మొయినాబాద్ రూరల్: తోటి వారు గుండెపోటుకు గురైనప్పుడు సీపీఆర్ చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ దామోదర్ తెలిపారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మొయినాబాద్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీలకు, పోలీసులకు, ఆశవర్కర్లకు సీపీఆర్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ డీహెచ్‌ఎంవో దామోదర్, ఎంపీపీ నక్షత్రం హాజరై మాట్లాడారు. ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోతే వెంటనే సీపీఆర్ చేయాలని సూచించారు. తద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన వివిధ దేశాల్లో అనేక మందికి గుండెపోటు వస్తే సీపీఆర్ చేయడం ద్వారా 90 శాతం మంది బతుకుతున్నారని తెలిపారు. అదే మన దేశంలో 100మందికి గుండెపోటు వస్తే 70మంది మాత్రమే కోలుకుంటున్నారని మిగతా 30 మంది చనిపోతున్నారని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో సీపీఆర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ గోపాల్‌రెడ్డి, ఆరోగ్య వైద్య అధికారి వాణి, పల్లె ఆస్పత్రి డాక్టర్లు మనీష్ చందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 22మేకల మృతి


చనిపోయిన మేకలను చూపుతున్న రైతు జగనయ్య

కొత్తూరు: కుక్కల దాడిలో 22 మేకలు మృతి చెందిన సంఘటన నందిగామ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. నర్సప్పగూడకు చెందిన రైతు జీ జగనయ్య కొన్నేళ్ల నుంచి మేకలు పెంచుతూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి తన పాకలో మేకల మందను ఉంచి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి మేకల అరుపులకు పాకలోకి రాగా కుక్కలు దాడి చేస్తున్నాయి. వాటిని తరిమి లోనికి వెళ్లి చూడగా సుమారు 22 మేకలు మృత్యువాతపడ్డాయి. వీటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. గొర్రె కాపరుల సంఘం నాయకుడు సురేందర్, సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్ బాధిత రైతును పరామర్శించి ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు

మైనర్ ఇరిగేషన్ ఏఈ రమేష్


పోతురాజు కుంటను పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

తలకొండపల్లి: చెరువుల్లో మట్టిని తరలిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మైనర్ ఇరిగేషన్ ఏఈ రమేష్‌నాయక్ హెచ్చరించారు. రాత్రి వేళ అక్రమ దందా శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈ రమేష్ నాయక్, ఆర్‌ఐ మంజుల మండలంలోని కోరింతకుంట తండా పరిధిలోని పోతురాజు కుంటను పరిశీలించారు. మట్టి తరలింపుపై ఆరా తీశారు. ఎంతమేర మట్టి తరలించారో అంచనా వేశారు. సర్వే నంబర్ 168లో 5.38 ఎకరాల విస్తీర్ణంలో కుంట ఉన్నట్లు గుర్తించారు. 150 నుంచి 200 క్యూబిక్ మీటర్ల మేర మట్టిని తరలించినట్లు ఇరిగేషన్ అధికారులు తేల్చారు. మైనర్ ఇరిగేషన్ అధికారులు రిపోర్టు ఆధారంగా ఎంత నష్టపరిహారం వేయాలో నిర్ణయిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు.

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- ప్రజలు సన్నద్ధం కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ రవీంద్రాచారి పిలుపునిచ్చారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా సోమవారం మీర్‌పేట లెనిన్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రవీంద్రాచారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విభజన హామీలను అమలు చేయించలేని తెలంగాణ బీజేపీ నాయకులకు ఓటు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు మోసం చేసి దేశం విడిచి పారిపోయిన దొంగల అప్పులను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేయడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేద ప్రజల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని చెప్పి 9 ఏళ్లు అవుతున్నా 15 రూపాయలు కూడా వేయలేదని ఆరోపించారు. హిట్లర్ తరహా పాలన సాగిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ దత్తునాయక్, బాలాపూర్ మండల కార్యదర్శి వెంకటరమణారెడ్డి, నాయకులు యాదయ్య, నరేందర్, దశరథ్, పీ రాజు, శత్రునాయక్, అంజయ్య, రజియా, ఆదిలక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.


లెనిన్‌నగర్ ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న రవీంద్రాచారి తదితరులు

ఇంట్లో నిద్రిస్తుండగా చోరీ

లక్ష నగదు, 5 సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిన దుండగులు

కొత్తూరు: ఆదమరిచి నిద్రిస్తున్న ఇంట్లోకి ప్రవేశించిన దొంగ లక్ష 46 వేల రూపాయల నగదు, 5 సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణగుడ కాలనీకి చెందిన కాలురామ్ అతని సోదరులు మరి కొంత మంది కూలీలతో గ్రానైట్ వేసే పనులు చేస్తుంటారు. పనుల నిమిత్తం కాలురామ్ ఆదివారం షాద్‌గనర్‌కు వెళ్లాడు. ఆయన సోదరులు, పని చేసేవారు ఇంట్లో నిద్రపోయారు. వేసవి దృష్ట్యా ఇంటి తలుపులు తెరిచి పడుకున్నారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి ప్యాంటు జేబులో ఉన్న రూ. లక్ష 46 వేల నగదు, 5 సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. ఉదయం విషయం గమనించిన బాధితుడు చోరీ జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి


మొగులయ్య మృతదేహం

శంకర్‌పల్లి: బైక్‌ను డీసీఎం వాహనం ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి శివారులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వికారాబాద్ జిల్లా, పరిగి మండలం, చిట్యాల్ గ్రామానికి చెందిన ఎం మొగులయ్య(52), పీ యాదగిరి ఆదివారం పని నిమిత్తం హైదరాబాద్‌కు బైక్‌పై బయలుదేరారు. పని ముగించుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా కొత్తపల్లి శివారులో వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం ఢీ కొట్టింది. మొగులయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. యాదగిరికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

కారు బోల్తా: ముగ్గురికి గాయాలు


గాయపడిన శ్రీకాంత్

చేవెళ్ల: కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా రాంచంద్రాపురం మండలం ఉస్మాన్‌సాగర్ గ్రామానికి చెందిన బీ శ్రీకాంత్, డీ మహిపాల్, డీ కృష్ణారెడ్డి సోమవారం కారులో చేవెళ్లకు వచ్చారు. సాయంత్రం శంకర్‌పల్లి వైపు వెళుతుండగా దేవుని ఎర్రవల్లి వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.